క్లుప్తంగా

ప్రత్యేక అవసరాల పిల్లలకు వైద్య పరీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న చామంతి నాగేశ్వరరావు

పిఠాపురం: స్థానిక బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఉపకరణాలు అందించేందుకు గాను వైద్య శిబిరం నిర్వహించారు. సమగ్ర శిక్ష కాకినాడ జిల్లా సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పి.రమేష్ ఆదేశాల మేరకు ఈ శిబిరం ఏర్పాటు చేశారు. కాకినాడ జిల్లా పరిధిలోని పిఠాపురం, గొల్లప్రోలు, యు.కొత్తపల్లి, పెద్దాపురం, సామర్లకోట మండలాల్లోని ఒకటి నుంచి 12వ తరగతి వరకూ చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సహిత విద్య కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపకరణాలను ఉపయోగించుకుని అత్యున్నత స్థాయికి ఎదిగిన దివ్యాంగులు ఎంతో మంది ఉన్నారన్నారు. లోపాలను ఉపకరణాలతో అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో పిఠాపురం ఎంఈఓ కేటీ నారాయణదాసు, శ్యాంబాబు, ప్రభుత్వ వైద్యులు కె.సత్యసాగర్, జి.మాధురి, ఆర్.ఉమామహేశ్వరరావు, ఎస్‌వీ కృష్ణవాసన్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి గొరకపూడి పరామర్శ



ఎంపీపీ సత్తిబాబును పరామర్శిస్తున్న గొరకపూడి చిన్నయ్యదొర

సామర్లకోట: ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబును భారతమాత సేవా పరిషత్తు వ్యవస్థాపక అధ్యక్షుడు, ఇటీవల వైఎస్సార్ సీపీలో చేరిన గొరకపూడి చిన్నయ్యదొర శనివారం పరామర్శించారు. ఎంపీపీ తండ్రి ఎర్రయ్య ఇటీవల మరణించారు. ఈ నేపథ్యంలో ఎంపీపీని పరామర్శించి, తన సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

విస్తృతంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు



పీబీ దేవం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్

సామర్లకోట: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు ముమ్మరం చేస్తున్నాయి. దీనికి సంబంధించి 24 గంటలూ ఫ్లయింగ్ స్క్వాడ్ పనిచేసేలా మూడు బృందాలను ఉన్నతాధికారులు ఏర్పాటు చేశారు. ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, ఈఓపీఆర్డీ క్రరి హరికృష్ణ సత్యారెడ్డి, హౌసింగ్ ఏఈ సురేష్‌కుమార్ పర్యవేక్షణలో వేర్వేరుగా మూడు బృందాలు ఫ్లయింగ్ స్క్వాడ్లుగా వ్యవహరిస్తున్నాయి. ఈ క్రమంలో అనుమానంగా ఉన్న వాహనాలను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి సురేష్ ఆధ్వర్యంలో కెనాల్ రోడ్డులో పీబీ దేవం గ్రామం వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో నగదు వెంట తీసుకువెళ్లాల్సి వస్తే.. పోలీసు, రెవెన్యూ ఉన్నతాధికారుల అనుమతి తీసుకోవాలని తెలిపారు. శుభకార్యాలు, కార్పొరేట్ ఆస్పత్రులకు నగదును తీసుకు వెళ్లేవారు తమ వెంట తగిన ఆధారాలు ఉంచుకోవాలన్నారు. అనుమతి లేకుండా నగదు, మద్యం వాహనాల్లో ఉంటే, కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పలు గ్రామాల్లో ఎన్నికల కోడ్ నిబంధనలపై రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన కల్పించారు.

బాల్యం నుంచే సంస్కృతిని అలవర్చాలి

బోట్‌క్లబ్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను బాల్యం నుంచే అలవర్చాలని భోగిగణపతి పీఠం వ్యవస్థాపక ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు అన్నారు. శనివారం ఉదయం పీఠంలో శ్రీవారి 23వ జపయజ్ఞ పారాయణ జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన గోదావరి సంస్కృతీ సంస్థ నిర్వహించిన కూచిపూడి నృత్య బృందగాన పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామానికి చెందిన దేవరపల్లి మాధుర్య సాయిని గణపతి పీఠంలో సత్కరించారు. సంప్రదాయ కూచిపూడి నృత్య అభ్యాసనలో మాధుర్యను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను సత్కరించారు.

కంటికి రెప్పలా..

- తల్లీబిడ్డ సేవలో 'ఎక్స్‌ప్రెస్'
- బాలింతల ముంగిట బృహత్తర పథకం
- క్షేమంగా ఇళ్లకు చేరుస్తున్న వాహనం
- నిత్యం అందుబాటులో ఆధునీకరించిన వాహనాలు



పెద్దాపురం ఆస్పత్రి నుంచి బాలింతను ఇంటికి చేరుస్తున్న తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్(ఫైల్)

పెద్దాపురం: ప్రసవం అనంతరం తల్లీబిడ్డలను ఆస్పత్రి నుంచి వారి ఇళ్లకు క్షేమంగా చేర్చేందుకు ప్రభుత్వం 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ (102)' సర్వీసులను ప్రవేశపెట్టింది. ఇవి అందిస్తున్న సేవలకు సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఉన్న ఈ పథకం వాహనాలను ప్రభుత్వం మరింతగా అధునీకరించి, అందుబాటులోకి తీసుకొచ్చింది. బాలింతలు చేరే గమ్యం ఎంత దూరమైనా.. ఏ ప్రాంతమైనా.. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ క్షేమంగా.. పైసా ఖర్చు లేకుండా చేరుస్తోంది. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఉచితంగా తల్లీబిడ్డలను ఇంటికి చేరుస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది.

రాష్ట్ర ప్రభుత్వం అధునీకరించిన తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలు పెద్దాపురం డివిజన్ పరిధిలో తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో దూసుకుపోతున్నాయి. 2016లో అప్పటి ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. అప్పట్లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)కి ఒకటి వంతున మూడు నియోజకవర్గాలకు నాలుగు వాహనాలను మాత్రమే ఏర్పాటు చేశారు. ఇవి మరమ్మతులకు గురైనా, అప్పటి ప్రభుత్వం ఒక్క పైసా కూడా విదిలించేది కాదు. అంతేగాక ఒక్కొక్క వాహనంలో నలుగురైదుగురు బాలింతను తీసుకెళ్లాల్సి వచ్చేది. ఉదయం బాలింత ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయినా సాయంత్రం వరకూ తమ ఇళ్లకు చేరే పరిస్థితి ఉండేది కాదు. ఇక ప్రత్తిపాడులోని వాహనమైతే నెలల తరబడి మరమ్మతుల కోసం ఎదురు చూసేది. బాలింతలు సొంత సొమ్ము ఖర్చు చేసుకుని ఏర్పాటు చేసుకున్న వాహనాల్లో తమ ఇళ్లకు వెళ్లేవారు. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారింది.

ఆధునీకరించిన వాహనాలు

వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాలింతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యమిచ్చింది. తల్లీబిడ్డల సేవలో ఆధునీకరించిన వాహనాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చింది. పెద్దాపురం ఏరియా ఆస్పత్రి పరిధిలో నాలుగు, ప్రత్తిపాడు, ఏలేశ్వరం, గోకవరం ఆస్పత్రులకు రెండేసి, రౌతులపూడి, జగ్గంపేట, కోటనందూరు ఆస్పత్రులకు ఒక్కొక్కటి వంతున మొత్తం 16 వాహనాలను సమకూర్చింది. ఆయా వాహనాలు అక్కడి ఆస్పత్రులకే పరిమితం కాకుండా, సమీప మండలాల్లోని ప్రభుత్వ ఆస్పత్రులకూ సేవలందిస్తున్నాయి. ఒక్కొక్క తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో నెలకు 40 నుంచి 80 మంది బాలింతలను సొంత ఇళ్లకు చేరుస్తున్నాయి. ఈ వాహనాల్లో బాలింతల ఆధార్‌తో సహా పూర్తి సమాచారాన్ని లాగ్ బుక్, ఫీల్డ్ బుక్‌ల్లో నమోదు చేస్తారు. ఆస్పత్రుల్లో ప్రసవించిన బాలింతలను పూర్తి ఉచితంగా ఈ వాహనాల్లో ఇళ్లకు చేరుస్తున్నారు. వీటి సేవలతో బాలింతలు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్స్‌ప్రెస్‌తో ఎంతో ప్రయోజనం



ఆస్పత్రి నుంచి బాలింత ఇంటికి వెళ్లాలంటే ఎంతో ఖర్చు. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవం తర్వాత డిశ్చార్జి చేసిన రోజే పైసా ఖర్చు లేకుండా, ఉచితంగా, ఎటువంటి ప్రయాస లేకుండా ఇంటికి చేరుస్తున్నారు.
– పోలవరపు దుర్గా నాగలక్ష్మి, గొల్లప్రోలు

క్షేమంగా చేర్చడమే మా విధి



గతంలో ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయిన బాలింతలు ఎవరికి వారే వాహనాలను ఏర్పాటు చేసుకుని, ఇళ్లకు వెళ్లేవారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ ద్వారా ఎంత దూరమైనా సొంతిళ్లకు చేరుస్తోంది. వారిని క్షేమంగా చేర్చడమే మా కర్తవ్యం. – అనిల్‌కుమార్, పైలట్, 102 సర్వీసు, పెద్దాపురం

నేటితో ముగియనున్న వడ్డీ రాయితీ

- ఇప్పటికీ రూ.2.93 కోట్ల పన్ను వసూళ్లు

సామర్లకోట: రాష్ట్ర ప్రభుత్వం పన్నుపై ఇచ్చిన వడ్డీ రాయితీ ఆదివారంతో ముగుస్తుందని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. మున్సిపాలిటీలో రూ.4.20 కోట్ల బకాయిలు ఉండగా, శనివారం రాత్రి వరకూ రూ.2.93 కోట్లు వసూలైందని చెప్పారు. రూ.కోటి వరకూ ప్రభుత్వ కార్యాలయాల పన్నుల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం వడ్డీ రాయితీ ప్రకటించక ముందు వరకూ రూ.1.70 కోట్లు వసూలు కాగా, వడ్డీ రాయితీ ప్రకటించిన తర్వాత రూ.1.23 కోట్లు వసూలైందని వివరించారు. బకాయిదారులు పన్నులు చెల్లించి వడ్డీ రాయితీ పొందాలన్నారు. ఆదివారం సెలవు అయినప్పటికీ రాత్రి తొమ్మిది గంటల వరకూ పన్నులు వసూలు చేస్తారని చెప్పారు.

మార్కెట్ ఆశీలు వేలం పూర్తి

సామర్లకోట: పట్టణంలో ఆశీలు వసూలు చేసుకోవడానికి నిర్వహించిన బహిరంగ వేలం ఎట్టకేలకు శనివారం పూర్తయింది. కొన్ని నెలలుగా ఆశీలు పాటలో పాల్గొనడానికి పాటదారులు హాజరు కాకపోవడంతో, అధికారులు పాటను వాయిదా వేస్తూ వచ్చారు. శనివారం బహిరంగ వేలంలో ఇద్దరు హాజరు కావడంతో పాట నిర్వహించారు. ఈ మేరకు రూ.10.60 లక్షలకు పాట జరిగినట్టు రెవెన్యూ అధికారి సీహెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. గతేడాది రూ.10.20 లక్షల బహిరంగ వేలం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ ఎ.అనంతలక్ష్మి, ఆర్‌ఐ సురేంద్రకుమార్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రన్ ఫర్ జీసస్

జెండా ఊపి ప్రారంభించిన దవులూరి దొరబాబు



సామర్లకోటలో ఏసు కోసం పరుగు ప్రారంభించిన దొరబాబు తదితరులు

సామర్లకోట: ఏసు కొరకు పరుగు కార్యక్రమాన్ని శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక సీబీఎం గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ పెద్దాపురం అసెంబ్లీ అభ్యర్థి దవులూరి దొరబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు ప్రారంభించారు. ఏసు క్రీస్తు మరణించిన మూడో దినాన్ని సమాధిని గెలిచి పునరుత్థానుడైన సందర్భాన్ని చాటిచెబుతూ క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని హుషారుగా కొనసాగించారు. సీబీఎం హైస్కూల్ నుంచి బ్రౌన్‌పేట, పాత పోలీసు స్టేషన్, కొట్లమ్మ చెరువు, పెన్షన్‌లైన్, మెహర్ కాంప్లెక్స్, మఠం సెంటర్, స్టేషన్ సెంటర్‌కు చేరింది. అక్కడ మండల పాస్టర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రార్థనలు చేశారు. మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు దవులూరి సుబ్బారావు మాట్లాడుతూ అందరూ ఏసు ప్రభు మార్గాన నడవాలని సూచించారు. స్టేషన్ సెంటర్ నుంచి గాంధీచౌక్, మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆంధ్రా బాప్టిస్టు చర్చి వద్ద పరుగు ముగిసింది. కార్యక్రమానికి మండల పాస్టర్ల సంఘ అధ్యక్షుడు పి.ఆనందబాబు అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శులు మడికి సొనియా, జానీ మోజెస్,, కౌన్సిలర్లు పాలిక కుసుమ, పిట్టా సత్యనారాయణ, నేతల హరిబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, పాస్టర్ల సంఘ నాయకులు ఎం సాల్మన్‌రాజు, వి.జాన్, కె.కిషోర్‌బాబు, పి.బనుప్రసాద్, పి.జ్ఞానరాజు, ఆయా చర్చిల పాస్టర్లు డాక్టరు ఈలి సువార్తరాజు, బి దానియేలు, జె.జయరాజు, వి.సామ్యూల్‌రాజు, బి.సత్యానందం, వై.మోజెస్, డి.రాజారత్నం, బిషప్ టి.బ్లెస్సింగ్, జయబాబు, బాప్టిస్ట్ ఫీల్డ్ కౌన్సిల్ అధ్యక్షుడు సల్లూరి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న దైవజనులు, పురప్రజలు



పిఠాపురంలో రన్ ఫర్ జీసస్ నిర్వహిస్తున్న క్రైస్తవులు

పెద్దాపురం: క్లాప్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో భాగంగా శనివారం తలపెట్టిన ర్యాలీ ఉత్సాహంగా సాగింది. స్థానిక లూథరన్ చర్చి వద్ద ర్యాలీని డాక్టర్ విజయలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమ కో–ఆర్డినేటర్ లంక పురుషోత్తమ్‌దాసు అధ్యక్షత వహించారు. తొలుత దైవజనులు డి.వెంకట్‌పాల్, బి.విద్యాసాగర్, తలారి విజయ్‌కుమార్, పరంజ్యోతిమ్మ ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక మున్సిపల్ సెంటర్, మెయిన్ రోడ్డు, దర్గా సెంటర్, పాత బస్టాండ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో పి.జాన్, సీబీఐ సుకుమార్, గిద్యోను, జ్యోతిబాబు, సాల్మన్‌రాజ్, తలారి విజయ్‌కుమార్, పల్లా చిన్ని, ఇమ్మానియేలు సహాయం, చందూ స్టీఫెన్, మున్నా, రత్నరాజు, స్టీఫెన్, మార్క్, నవీన్ రాజకుమారితో పాటు, పలువురు పట్టణ ప్రముఖులు, దైవజనులు, విశ్వాసులు పాల్గొన్నారు.

పిఠాపురంలో రన్ ఫర్ జీసస్

పిఠాపురం: యునైటెడ్ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పిఠాపురం పట్టణంలో రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రభుత్వ హాస్పటల్ వరకూ సుమారు 400 మంది క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ నిర్వహించారు. పాస్టర్ సమర్పణ, యాకోబ్‌రాజు, జోసెఫ్ రాజు, ఎండీ రాజు, ప్రేమానందం, తరుణ్ పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో విజయం ఖాయం



కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న షేక్ బాబ్జాన్



పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను మర్యాదపూర్వకంగా కలిసిన షేక్ బాబ్జాన్

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అదనపు పరిశీలకుడు షేక్ బాబ్జాన్

పిఠాపురం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మళ్లీ అఖండ విజయం సాధించడం ఖాయమని ఆ పార్టీ పిఠాపురం నియోజకవర్గ అదనపు పరిశీలకుడు షేక్‌బాబ్జాన్ అన్నారు. వైఎస్సార్ సీపీ కాకినాడ ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ప్రస్తుత ఎంపీ, పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతను కాకినాడలో ఆయన శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎన్నికల ప్రచారంపై, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి కార్యకర్తలు, నాయకులను సమాయత్తం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ఆయన వెంట పార్టీ జిల్లా యువజన అధ్యక్షుడు కొప్పన శివనాథ్, రాష్ట్ర స్వచ్ఛ సర్వేక్షణ్ డైరెక్టర్ బత్తుల సాయి తదితరులు ఉన్నారు.

సంక్షేమానికి మరో అవకాశం ఇవ్వండి



రమణక్కపేటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న వంగా గీత, ఆకుల వీర్రాజు

- డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు
- రమణక్కపేటలో వంగా గీతతో కలిసి ఎన్నికల ప్రచారం

పిఠాపురం: ప్రజా సంక్షేమం, అభివృద్ధిని కొనసాగించడానికి వైఎస్సార్ సీపీకి మరోసారి అవకాశం ఇవ్వాలని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ఓటర్లను విజ్ఞప్తి చేశారు. కొత్తపల్లి మండలం రమణక్కపేటలో వైఎస్సార్ సీపీ పిఠాపురం ఎమ్మెల్యే అభ్యర్థి వంగా గీతతో కలిసి శనివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికులు వారికి ఘన స్వాగతం పలికి మీ వెంటే మేము ఉన్నామంటూ భరోసా ఇచ్చారు. అవినీతికి తావులేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు నేరుగా అందించిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవలసిన బాధ్యత అందరిపైనా ఉందని ఆకుల వీర్రాజు అన్నారు. అందరికీ సుపరిచితురాలు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే వంగా గీతను ఎమ్మెల్యేగా గెలిపించుకోవడం ద్వారా మరింత అభివృద్ధిని సాధించడానికి ప్రజలు సహకరించాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉన్న వంగా గీతకే పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధిలో నడిపించడం సాధ్యమన్నారు. వంగా గీత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు వందల కోట్ల రూపాయలు విడుదల చేశారన్నారు. మరింత అభివృద్ధి చేసేందుకు తనను పంపించారని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాలపై విచారణ జరపండి

- డిమాండ్ చేసిన కౌన్సిలర్లు
- వాడివేడిగా కౌన్సిల్ సమావేశం



చైర్ పర్సన్ పచ్చిమళ్ల జ్యోతికి ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో తమకు తెలియకుండా నియమించిన ఉద్యోగాలపై విచారణ జరపాలని పలువురు కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ పచ్చిమళ్ల జ్యోతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అధికారులు అజెండాలో పొందుపరచిన అంశాలను చదివి వినిపించగా సభ్యులు వాటిని ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా పలువురు కౌన్సిలర్లు మాట్లాడుతూ ఇటీవల ఎవరికీ తెలియకుండా పలు ఉద్యోగ నియామకాలు జరిపారన్నారు. కౌన్సిల్ అనుమతి లేకుండా ఎలా వారిని నియమించారని అధికారులను నిలదీశారు. దీనిపై కమిషనర్ కనకారావు మాట్లాడుతూ మీకు అభ్యంతరం ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో 24 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి లిఖిత పూర్వక ఫిర్యాదును కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో మున్సిపాలిటీలో ఏడుగురిని నియమించినట్లు పత్రికల ద్వారా తెలిసిందన్నారు. తమకు ఎటువంటి సమాచారం లేకుండా రహస్యంగా నియమించడం పట్ల తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి ఉద్యోగాలను రద్దు చేయాలని, తిరిగి కౌన్సిల్ అనుమతితో నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం అజెండాలో ప్రతిపాదించిన విషయాలపై చర్చ జరిగింది. పలువురు కౌన్సిలర్లు స్థానిక సమస్యలపై అధికారులను నిలదీశారు. పట్టణంలో పారిశుధ్య సమస్య పెరుగుతోందన్నారు. వీధిలైట్లు, డ్రైన్లు, రోడ్లు తదితర సమస్యలు ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొత్తపల్లి పద్మ, పలువురు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

నీటి సమస్య ఉందా?

టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని కమిషనర్ సూచన

కాకినాడ: ప్రస్తుత వేసవిలో ఎక్కడైనా మంచినీటి సమస్య ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ప్రజలను కోరారు. వేసవి నీటి ఎద్దడిపై కార్పొరేషన్ ప్రత్యేక అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్ ఆదేశాల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవి నీటి ఎద్దడిపై జిల్లా కలెక్టర్‌తో శనివారం జరిగిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఈ మేరకు వాటర్ వర్క్ అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఏ ప్రాంతంలోనైనా నీటి సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1800 4255 990కు కాల్ చేయాలని కమిషనర్ సూచించారు. సత్వరమే నీటి సమస్యను పరిష్కరించడంతో పాటు, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తామని చెప్పారు. ప్రజలెవ్వరూ మంచినీటి కోసం ఇబ్బంది పడకుండా ఇప్పటికే అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. రూ.1.28 కోట్ల ఖర్చుతో వేసవి కార్యాచరణను కూడా సిద్ధం చేశామని కమిషనర్ తెలిపారు.

• కూల్ ఈజ్ వెల్

- మండుతున్న ఎండలు
- చల్లదనం కోసం ప్రజల ఆపసోపాలు
- కూల్ డ్రింక్స్, చెరకు, పండ్ల రసాలకు పెరిగిన డిమాండ్
- కళకళలాడుతున్న సాగర తీరం



సాగర తీరంలో పర్యాటకుల సందడి

పిఠాపురం: ఎండలు మండిపోతున్నాయి. ఉదయం నుంచే భానుడి తన ప్రతాపం చూపుతున్నాడు. ప్రజలు ఎండ వేడిమి నుంచి రక్షణ పొందడానికి ఆపసోపాలు పడుతున్నారు. తమకు అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను అనుసరిస్తున్నారు. ఎండలు మండుతున్నా బయటకు వెళ్లకతప్పని పరిస్థితుల్లో కంటికి, తలకు రక్షణ కవచాలు ధరించి ఇంటి నుంచి అడుగు బయట పెడుతున్నారు. ఎండ నుంచి రక్షణ చర్యల్లో భాగంగా కళ్లకు రక్షణగా చల్లదనాన్ని ఇచ్చే కళ్ల జోళ్లు, శరీరానికి చల్లదనాన్ని ఇచ్చే చెరకు, పండ్ల రసాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండడంతో వాటికి గిరాకీ పెరిగింది. ప్రతి గ్రామంలోనూ రోడ్లకు ఇరువైపులా కళ్లజోళ్లు, చెరకు, పండ్ల రసాల దుకాణాలు వెలిశాయి. రూ.100 నుంచి చలువ కళ్లద్దాలు లభ్యమవుతుండడంతో అందరు వాటిని కొనుగోలు చేసి ధరిస్తున్నారు. పనిలో పనిగా శరీరాన్ని ఉష్ణ తాపం నుంచి రక్షించుకోడానికి చల్లదనం కోసం ఆరోగ్యప్రదాయని అయిన చెరుకు రసం తాగుతున్నారు. ప్రయాణికులు తాము చెరకు రసం తాగడంతో పాటు బాటిళ్లలో ఇళ్లకు తీసుకువెళ్లడంతో అమ్మకాలు ఊపందుకున్నాయి. కాకినాడ జిల్లాలో పలు పంచదార పరిశ్రమలు మూత పడడంతో కేవలం రసం కోసమే చెరకు పండిస్తున్నారు. కొబ్బరి, ఖర్బూజా, పుచ్చ, బొప్పాయి, నారింజ, దానిమ్మ, బత్తాయి, ద్రాక్ష తదితర పళ్ల రసాలకు డిమాండ్ బాగా పెరిగింది. మరోపక్క శారీరక మానసిక ఉల్లాసం, చల్లదనం కోసం సాగరతీరానికి పర్యాటకులు భారీగా తరలివస్తున్నారు. దీంతో ప్రతిరోజూ సాగర తీరం యాత్రికులతో కళకళలాడుతోంది.



ఫ్రూట్ జ్యూస్ సెంటర్





ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో కళ్ల జోళ్లు, చెరకు రసం అమ్మకాలు

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



జె.తిమ్మాపురంలో పార్టీలో చేరుతున్న వారిని సాదరంగా ఆహ్వానిస్తున్న సునీల్, దొరబాబు

- ఆహ్వానించిన ఎంపీ అభ్యర్థి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దొరబాబు

పెద్దాపురం: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ప్రజా సంక్షేమ పథకాలు నచ్చి, మరోసారి ఆయననే సీఎంగా చేసేందుకు పెద్దాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి భారీగా వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని కాకినాడ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని జె.తిమ్మాపురం గ్రామంలో శనివారం రాత్రి వంద మంది టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన కార్యకర్తలు దొరబాబు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎంపీ అభ్యర్థి సునీల్, దొరబాబు పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయానికి తమవంతు కృషి చేస్తామని, జె.తిమ్మాపురం గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేస్తామని సునీల్, దొరబాబుకు హామీ ఇచ్చారు. పార్టీ రహితంగా ప్రజలకు అందిన సంక్షేమం, లబ్ధిని వివరించి, పార్టీ విజయానికి పాటుపడాలని సునీల్, దొరబాబు సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, రాష్ట్ర కార్మిక నాయకులు దవులూరి సుబ్బారావు, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ గోప్పు మురళి తదితరులు పాల్గొన్నారు.

జీయన్న మఠంలో ప్రత్యేక పూజలు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు జీయన్న మఠంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామున అర్చకులు స్వామివారికి విశేష పూజలు చేసి భక్తులకు దర్శనాలు కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.